నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 28 ఆగస్టు 2024 | SIDDIPET

వైద్య కళాశాలలో అన్ని వసతులు కల్పిస్తాం

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్

మెదక్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ):మెదక్‌లోని పిల్లి కొట్యాల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. డిపార్ట్‌మెంటల్ తరగతి గదులు, ల్యాబ్‌లు, ప్రయోగశాలలు, వివిధ రకాల వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో అన్ని రకాల వసతులతోపాటు విద్యార్థులు నేర్చుకోవడానికి అనువైన అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర దవాఖాన సూపరింటెండెంట్ శివదయాల్, ప్రిన్సిపాల్ రవీందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా జోగిపేట ప్రభుత్వ దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- అందోల్ మండలం జోగిపేట ప్రభుత్వ దవాఖాన తనిఖీ

అందోల్, ఆగస్టు 27: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రజలకు సూచించారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని ప్రభుత్వ దవాఖానను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. డెంగీ, విషజ్వరాలకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైద్యులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దవాఖానలో 17 డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. ప్రభుత్వ దవాఖానలోనే నాణ్యమైన వైద్యం అందించే విధంగా కృషిచేయాలని వైద్యులను ఆదేశించారు. దవాఖాన ప్రాంగణంలో పరిశుభ్రమైన వాతావరణం కనబడే విధంగా శానిటైజేషన్ సిబ్బంది చూసుకోవాలన్నారు. అనంతరం అందోల్‌లోని ఏడో వార్డులో ఉన్న బస్తీ దవాఖానను తనిఖీ చేసి గ్రామస్తులకు అందుతున్న వైద్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందోల్‌లో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి సత్యనారాయణ, హెల్త్ అధికారి కిషన్ నాయక్, డిప్యూటీ తసీల్దార్ మధుకర్‌రెడ్డి, కమిషనర్ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, సూపర్ వైజర్ నారాయణ, వార్డు అధికారి లక్ష్మీనారాయణ, మెప్మా టీఎంసీ భిక్షపతి పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అక్రమాలు !

మెదక్ జిల్లా చేగుంట మండలం ఇబ్రహీంపూర్ పీఏసీఎస్‌లో భారీగా అవినీతి

- సొసైటీ సెక్రటరీపై ఆరోపణలు
- డమ్మీ రసీదులతో బిల్లులు డ్రా
- ఇష్టానుసారంగా ఖర్చులు
- గన్నీ బ్యాగుల్లో కూడా లక్షల్లో స్కాం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- విచారణలో ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న నిజాలు

సిద్దిపేట, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో జరిగిన అవినీతి ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. డమ్మీ బిల్లులు పెట్టి పెద్ద ఎత్తున డబ్బులు డ్రా చేసినట్లు పలు సొసైటీలపై ఆరోపణలు వస్తున్నాయి.డబ్బులకు ఆశపడి వోచర్లు చూపకుండానే అధికారులు ఆడిట్ చేస్తున్నారు.లక్షల రూపాయల అవినీతి జరిగినా ఆడిట్ అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ధాన్యం కొనుగోలు సమయంలో గన్నీ బ్యాగుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నది. రైతుల పంట రుణమాఫీ కావడంతో సహకార సంఘాల అసలు గుట్టు రట్టవుతున్నది. రైతుల పంట రుణాల్లో గోల్‌మాల్ జరిగాయి. సొసైటీ అధికారుల తీరు వల్ల ఎంతో మంది రైతులు పంటరుణమాఫీ కాకుండా నష్టపోతున్నారు. ఇదంతా జిల్లా స్థాయి అధికారుల అండతోనే సొసైటీ సెక్రటరీలు చేస్తున్నారు. ఇందులో అందరూ వాటాలు పంచుకుంటున్నారు. ఇటీవల కొన్ని సొసైటీలపై వచ్చిన ఆరోపణలను బట్టి ఇదిస్పష్టంగా తెలుస్తోంది. ఆరోపణలు వచ్చిన సొసైటీపై విచారణకు జిల్లాస్థాయి డిపార్ట్‌మెంట్ అధికారులు వచ్చి ఏదో విచారణ చేశామా..? అంటే చేశాము అని నివేదికలు ఇస్తున్నారు తప్పా అసలు గుట్టు రట్టు చేయడం లేదు. దీని వెనుక పెద్ద ఎత్తున డబ్బులు వారికి ముడుతున్నాయి. దీంతో వారికి అనుకూలంగా అంతా సక్రమమే అని పాజిటీవ్ రిపోర్టు ఇస్తున్నారు.

ఇబ్రహీంపూర్ సొసైటీలో..

మెదక్ జిల్లా చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆ సొసైటీ పరిధిలోని రైతులు ఆరోపిస్తున్నారు.ఈ సొసైటీలో 2020 నుంచి 2023 వరకు జరిగిన అక్రమాలపై ఇటీవల జిల్లా కలెక్టర్‌తో పాటు సీఎం క్యాంపు కార్యాలయం, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆర్సీఎస్ హైదరాబాద్ వారికి రైతులు ఫిర్యాదు చేశారు. సొసైటీ సెక్రటరీ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ భారీగా అవినీతికి పాల్పడ్డాడని సొసైటీ పరిధిలోని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2020, 2021, 2022, 2023లో ఆడిట్ చేసేటప్పుడు వోచర్లు లేకుండానే అధికారులు ఆడిట్ చేశారు. దీని వెనుక ఆడిట్ అధికారులకు డబ్బులు ఇచ్చి అంతా ఒకే చేయించుకున్నాడు. ఈ సొసైటీ పరిధిలో మొత్తం 23 గ్రామాలు ఉండగా 3675 మంది రైతులు ఉన్నారు. 848 మంది రైతులు పంటరుణాలు తీసుకున్నారు. వీరిలో 311 మందికి లక్షా 50 వేల వరకు, 44 మందికి 2 లక్షల వరకు పంటరుణమాఫీ అయింది. మొత్తం 355 మందికి ఈ సొసైటీ పరిధిలో పంటరుణమాఫీ కాగా ఇంకా 493 మందికి పంటరుణమాఫీ కావాల్సి ఉన్నది. ఐతే చాలావరకు రైతులకు పంటరుణాలు ఇచ్చేటప్పుడు చెక్ లీస్టులో ఒక హెక్టార్‌కు ఎంత రుణం మంజూరు చేశాం..ఇప్పుడు ఎంత ఇస్తున్నాం అనే వివరాలు ఉంటాయి. రైతులకు ఇచ్చేటప్పుడు ఇవి ఏవీ చూపించకుండానే ఇంతరుణం ఇస్తున్నాము అని చెబుతారు. ఖాళీ వోచర్ మీద సంతకం తీసుకుంటారు. తర్వాత డబ్బులు రాస్తారు. ఇలా చాలామంది రైతులు నష్టపోతున్నారు. ఈ సొసైటీ కింద ఫర్టిలైజర్, పెట్రోల్ బంక్‌లు కూడా ఉన్నాయి. వీటిలో కూడా నిధుల గోల్‌మాల్ జరిగింది. ప్రభుత్వ అనుమతితో ప్రతిఏటా సొసైటీ పరిధిలో పది కొనుగోలు కేంద్రాలు నడుపుతారు. దీంట్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. సహకార చట్టం ప్రకారం పాలకవర్గం వారికి ఎవరికీ కూడా కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యత ఇవ్వవద్దు కానీ, ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. నాలుగేండ్లుగా గన్నీబ్యాగులను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. సొసైటీలో అంతా నా ఇష్టం నేను చెప్పిందే వేదం.. అన్న తరహాలో సెక్రటరీ వ్యవహరిస్తున్నారు. పాలకవర్గానికి తెలుపకుండానే సంతకాలు తీసుకొని ఇష్టానుసారంగా రాసుకొని జిల్లా అధికారుల అనుమతి తీసుకున్నట్లు సమాచారం.

విచారణలో ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న అక్రమాలు

మెదక్ జిల్లా చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్ సొసైటీలో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు. పెద్ద మొత్తంలోనే స్కాం జరిగింది. సొసైటీ సెక్రటరీ ఇష్టానుసారంగా వ్యవహరించి సొసైటీకి భారీగానే కన్నం వేశాడనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా స్థాయి అధికారులను మచ్చిక చేసుకొని తన అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. 2020 నుంచి 2023 వరకు విచారణకు వచ్చిన ఒక అధికారి, సొసైటీ సెక్రటరీ ఇచ్చిన మామూళ్లతో ఎలాంటి విచారణ చేయకుండానే రిపోర్టు ఇచ్చాడు. రెండోసారి ఇంకో అధికారిని నియమించారు. జిల్లా స్థాయి అధికారుల హస్తం కూడా దీంట్లో ఉన్నది. పాలకవర్గ సమావేశాలు జరిగినప్పుడు విందులు, వినోదాల పేరిట భారీగా ఖర్చు చేశారు. టూర్ల పేరిట ఇతర ప్రాంతాలకు తీసుకుపోయారు. తనకు ఎదురుగా ఎవరు మాట్లాడిన వారిని డబ్బులు ఇచ్చి అనుకూలంగా మార్చుకున్నారు. సొసైటీ నిధులను డమ్మీ రసీదులతో డ్రా చేసి అవినీతికి పాల్పడ్డాడు. తన అవినీతి సొమ్ముతో బినామీ పేర్లతో లారీలు సైతం తీసుకున్నాడు. సొసైటీలో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఆ డబ్బులు రికవరీ చేయాలని సొసైటీ పరిధిలోని వివిధ గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ జరుగుతున్నది

మెదక్ జిల్లా చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్ సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతున్నది. ఇప్పటి వరకు ఒక విచారణ పూర్తి చేశాం. దాంట్లో కొంత క్లారిటీ వచ్చింది. కొంత అక్రమాలు జరిగిన మాట వాస్తవమే ..రెండో విచారణ చేపడుతున్నాం. గన్నీ బ్యాగులకు సంబంధించిన వాటితోపాటు ఇతర అంశాలపై విచారణ పూర్తయ్యాక ఎంత జరిగింది... ఏం జరిగింది అన్న విషయాలు తెలియజేస్తాం. ఇప్పుడే ఏం చెప్పలేం.

– కరుణ, డీసీవో, మెదక్ జిల్లా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, ఆగస్టు 27:మెదక్ జిల్లా నర్సాపూర్ ఏరియా దవాఖానను మంగళవారం కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. మెడికల్ స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. మందుల కొరత లేకుండా చూడాలని, జిల్లాలో మూడు తీవ్ర జ్వర కేసులు నమోదయ్యాయని, అవి కూడా తగ్గుముఖం పట్టాయన్నారు. అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. గుంతల్లో మురుగు నిల్వకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టడానికి కిరోసిన్, క్రూడాయిల్‌ను చల్లాలని ఆదేశించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు మలేరియా, చికెన్ గున్యా బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇండ్లల్లో నీటి నిల్వ లేకుండా, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, వాడిన టీ కప్పులు, ఇతర నీటి నిల్వలు గలచిన్న పాత్రలను ఎప్పటికప్పుడు తొలిగించాలన్నారు. వ్యక్తిగత పరిసరాల శుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. కలెక్టర్ వెంట నర్సాపూర్ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మహిళపై లైంగిక దాడి: కేసు నమోదు

నారాయణఖేడ్, ఆగస్టు 27: నారాయణఖేడ్ పట్టణంలో మహిళపై జరిగిన లైంగికదాడి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం అర్ధరాత్రి రాయిపల్లి రోడ్డులో ఓ దుకాణం ఎదుట నిద్రిస్తున్న మహిళపై నారాయణఖేడ్ పట్టణానికి చెందిన యువకుడు లైంగికదాడికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

వేతనాల కోసం కార్మికుల ఆందోళన

- రెండు మండలాల్లో నిలిచిపోయిన తాగునీటి సరఫరా
- తాగునీటి కోసం తండ్లాడుతున్న ఆయా మండలాల ప్రజలు

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని చీకూర్తిలో తాగునీటి కోసం వేచి చూస్తున్న మహిళలు

న్యాల్‌కల్, ఆగస్టు 27: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో మిషన్ భగీరథ పథకం తాగునీటి సరఫరా చేసే తాత్కాలిక కార్మికులు వేతనాల కోసం ఆందోళన బాట పట్టారు. దీంతో న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. పదిరోజులుకు పైగానే ఆయా మండలాల్లోని దాదాపు 75 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం కింద తాగునీరు సరఫరా నిలిచిపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఆయా గ్రామాల్లోని తాగునీటి సరఫరా చేసే బావులు, బోర్లు బంద్ కావడంతో మిషన్ భగీరథ పథకంపైనే ప్రజలు ఆధారపడుతున్నారు. ఆయా మండలాలకు చాల్కి ఫిల్టర్ బెడ్ నుంచి రోజూ తాగునీరు సరఫరా అవుతున్నది. తాగునీటి సరఫరా చేసేందుకు నియమించిన తాత్కాలిక కార్మికులకు ఏడు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదు. పలుమార్లు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందని కార్మికులు వాపోతున్నారు. కార్మికుల ఆందోళనతో ఆయా మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బిందెడు నీటి కోసం గ్రామాల సమీపంలోని వ్యవసాయ పంపుసెట్లను ఆశ్రయించాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా..ఆయా మండలాల్లోని ప్రజలకు తాగునీటి సరఫరా ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. తాగునీటి సరఫరా చేసే ట్యాంకర్ల బిల్లులను సంబంధిత కాంట్రాక్టర్ నుంచి వసూలు చేసి చెల్లిస్తామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికుల సమస్యను సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చిస్తామన్నారు.

న్యాల్‌కల్ మండలంలోని రాఘవాపూర్ మిషన్‌భగీరథ ఫిల్టర్‌బెడ్ వద్ద వేతనాలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న కార్మికులు

ఆర్టీసీ కార్మికుల నిరసన

సిద్దిపేట టౌన్,ఆగస్టు 27:ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి తొమ్మిది నెలల గడుస్తున్నా ఇప్పటివరకు ఎందుకు ముందడుగు వేయడం లేదని కార్మికులు ప్రభుత్వాన్ని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ కన్వీనర్ మౌలానా, నాయకులు శేషు,రవీందర్ మాటాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 2013 బాండు బకాయిలు చెల్లిస్తామని, 2021 పీఆర్‌సీ అమలు చేస్తామని, అన్ని విభాగాల్లో నియామకాలు చేసి పని భారాన్ని తగ్గిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని మండిపడ్డారు.యూనియన్లను తిరిగి మనుగడలోకి తీసుకువస్తామని చెప్పిందన్నారు.ఇప్పటి వరకు చాలాసార్లు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల సాధన కోసం భవిష్యత్‌లో వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసనలో కార్మిక సంఘాల నేతలు గౌడ్, రాజయ్య, నూరొద్దీన్, పీడీరెడ్డి పాల్గొన్నారు.

సిద్దిపేట ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కార్మికులు


సిద్దిపేటలో కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ప్రజాపాలనలో కాంగ్రెస్ విఫలం

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఆగస్టు 27: ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పులను కప్పి పుచ్చుకునేందుకు హైడ్రాపేరుతో ప్రభుత్వం మరో హైడ్రామాకు తెరలేపిందన్నారు. రేవంత్ సర్కారు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నదని ఆరోపించారు. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని, ప్రజలు డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో రోగులు దవాఖానకు వెళ్తే అక్కడ సరైన వైద్య సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. సక్రమంగా పంటరుణమాఫీ చేయలేదని, పింఛన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిధులు మంజూరు చేయాలి

మంగళవారం సాయంత్రం సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరిని కలిసిన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు, గ్రామాల్లో పారిశుధ్య పనులకు సంబంధించిన నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రావు, వెంకటనర్సింహారెడ్డి, కడతల రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓపీ స్లిప్పుల కోసం రోగుల తంటాలు

సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ దవాఖానలో రోగులు ఓపీ (ఔట్ పేషెంట్) స్లిప్పుల కోసం తంటాలు పడుతున్నారు. గతంలో రోగి పేరు, వివరాలు చెబితే సిబ్బంది స్లిప్పు నేరుగా రాసి ఇచ్చేవారు. కానీ కొత్తగా ఓపీ స్లిప్పు పొందాలంటే బార్‌కోడ్ స్కాన్ చేసి దానికి ఆధార్ లించ్‌చేశాక సెల్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేస్తే తప్ప రోగులకు ఓపీ స్లిప్పు అందడం లేదు. స్లిప్పుకోసమే గంటల తరబడి రోగులు క్యూలో ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు.

– సంగారెడ్డి జిల్లా ఫొటోగ్రాఫర్, ఆగస్టు 27

సిద్దిపేట జిల్లా బైరాన్‌పల్లిలో బురుజు వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తున్న నేతలు

అమరవీరులకు ఘన నివాళి

మద్దూరు(ధూళిమిట్ట),ఆగస్టు 27: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో మంగళవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ బయో డీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని చారిత్రాత్మక బురుజు వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు లింగంపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు గంధమాల యాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోత్కూరి మల్లేశ్, నాయకులు గందె మల్లేశం, మయోజు మోహన్, సింగపాక భిక్షపతి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్టులపై అవగాహన పెంచుకోవాలి

సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట జిల్లా కేసీఆర్ నగర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 27: పదోతరగతి కెరీర్‌కు పునాది అని మనకు సబ్జెక్టు మీద పూర్తి అవగాహన ఉంటేనే పరీక్షల్లో రాయగలుగుతామని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి అంగన్‌వాడీ అపూర్వ ప్రాథమిక పాఠశాల–2, మందపల్లి మధిర గ్రామం పిట్టలవాడ, కేసీఆర్ నగర్‌లోని ప్రైమరీ, జడ్పీహెచ్ఎస్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా మిట్టపల్లిలోని అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల–2ను పరిశీలించారు. ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిట్టలవాడలో ఇంతకుముందు 40 మంది విద్యార్థులతో అద్దె భవనంలో ప్రాథమిక పాఠశాల నడపగా అద్దె భవన యజమాని రావడంతో పాఠశాలకు ఎలాంటి భవనం లేకుండా పోయిందని పిల్లలు కొంత మంది వేరే పాఠశాలకు వెళ్తున్నారని, కొంతమంది బడి మానేశారని, అదే ప్రాంతంలో పాఠశాల కోసం ఇదివరకే కొంత ఖాళీ స్థలాన్ని కేటాయించారని జిల్లా విద్యాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ వెంట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ సలీం, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు ఉన్నారు.

పండుటాకుకు ఎంతకష్టం

- కొడుకు ఆదరణ లేక పదేండ్లుగా ఒంటరిగా జీవనం
- వీధి కుక్కల దాడిలో తీవ్ర గాయాలపాలు

దుబ్బాకలో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు రంగవ్వ

దుబ్బాక, ఆగస్టు 27: నవ మాసాలు మోసి, కంటికి రెప్పలా కాపాడి పెద్ద చేసిన కొడుకుకు కన్నతల్లి భారమైంది. వృద్ధాప్యంలో తల్లికి అండగా నిలవాల్సిన కొడుకు తనకు సంబంధమే లేదంటూ అమానవీయంగా వ్యవహరించాడు. దీంతో పదేండ్లుగా గుడిసెలో ఒంటరిగా ఉంటూ భిక్షాటన చేసి కాలం వెల్లదీసింది. కొద్దిరోజుల క్రితం కాళ్లు చచ్చుబడిపోవడంతో నడవలేని ఆ వృద్ధురాలి ధీనస్థితిపై స్థానికులు చలించి కాలనీలో ఉన్న ఖాళీ స్థలంలో గుడిసె ఏర్పాటు వేసి గూడు కల్పించారు. రోజుకొకరు పెట్టిన అన్నం తింటూ బతికీడుస్తున్నది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి వీధికుక్కలు వృద్ధురాలి గుడిసెలోని చొచ్చుకొచ్చి ఆమెపై తీవ్రంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఒళ్లంతా తీవ్ర గాయాలతో ఆచేతన స్థితిలోకి చేరిన వృద్ధురాలిని చూసి కాలనీ వాసులు చలించిపోయారు. ఈ విషయాన్ని వృద్ధురాలు కొడుకుకు కాలనీవాసులు తెలిపినా పట్టించుకోలేదు. అలాంటి కసాయి కొడుకు లోకంలో ఏ తల్లికి ఉండవద్దంటూ దుమ్మెత్తిపోశారు. చేసేదేమి లేక చివరకు కాలనీ వాసులు 108 అంబులెన్స్‌లో దుబ్బాక సర్కారు దవాఖానకు ఆమెను తరలించి వైద్యం అందించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని రేపల్లెవాడలో వృద్ధురాలు అయ్యగారి రంగవ్వ(90) కన్న కొడుకు ప్రేమకు నోచుకోలేక ఒంటరిగా జీవిస్తున్నది. ఆమెకు సత్యనారాయణ ఒక్కగానొక్క సంతానం. అతడి విలాసాలకు ఉన్న ఐదెకరాల వ్యవసాయ భూమి, ఆస్తి హారతి కర్పూరంలా కరిగిపోయింది. వృద్ధాప్యంలో తల్లి సంరక్షణను మరిచాడు. కొడుకుకు భారంగా ఉండకూడదనుకుని ఆమె 20 ఏండ్లుగా దుబ్బాకలో భిక్షాటన చేసుకుని జీవించింది. ఆమెకు కాళ్లు చచ్చుబడడంతో పదేండ్లుగా రేపల్లెవాడలో ఆశ్రయం పొందుతున్నది.ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి వీధి కుక్కల దాడిలో ఆమె తీవ్రంగా గాయపడగా, 108 అంబులెన్స్‌లో దుబ్బాక వంద పడకల దవాఖానకు తరలించి వైద్యం అందించారు. పోలీసుల సూచనతో కొడుకు సత్యనారాయణ, మనువడు మోహన్ దవాఖానకు వచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను సిద్దిపేట జిల్లా దవాఖానకు వైద్యులు రిఫర్ చేశారు. వృద్ధురాలి ఆలనా పాలనా పట్టించుకోక పోవడంపై స్థానికులు కుమారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.